క్లుప్తంగా

వాహనదారులు అన్ని పత్రాలు ఉంచుకోవాలి

భైంసాటౌన్: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండి రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ ఎల్. శ్రీను అన్నారు. పట్టణంలోని పులేనగర్‌లో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడుతూ అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలు, మద్యం, నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ఎస్సైలు, కానిస్టేబుళ్లు, భద్రతా బలగాలు పాల్గొన్నారు.

చెరువు పరిశీలించిన కలెక్టర్



చెరువు ప్రాంతం వద్ద కలెక్టర్ వరుణ్‌రెడ్డి

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీ ప్రాంతం పరిధిలోని నల్దుర్తి చెరువును సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చెరువుకు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు వచ్చేలా ప్రణాళిక తయారు చేశారు. ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎఫ్ఓ సునీల్, సీసీఎఫ్ శర్వానంద్, పుండలీక్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

'బీఎస్పీతోనే రాజ్యాధికారం'

లక్ష్మణచాంద: బీసీలకు రాజ్యాధికారం కేవలం బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ పేర్కొన్నారు.సోమవారం మండలంలోని చింతల్‌చాందలో ఆయన మాట్లాడారు. బీసీలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. 2017లో బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కేసీఆర్ మాట నిలబెట్టుకోలేదన్నారు. ఎన్నికల కోసమే బీసీలకు రూ.లక్ష రుణం ఇస్తామని అంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ 70 సీట్లు బీసీలకు కేటాయిస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారన్నారు. బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ ఎస్‌కే.లక్ష్మి, మండలాధ్యక్షుడు నాగభూషణ్, ప్రత్యూష్, కరుణ, గంగామణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పశుమిత్రల వినతి

ఖానాపూర్: పశుసంవర్ధకశాఖలో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న పశుమిత్రలకు వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. వెంటనే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో రేఖానాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. లావణ్య, విజిత, సుమలత, ప్రగతి, రజిత, తదితరులున్నారు.

టీ-9 టికెట్లు అందజేత

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన టీ-9 టికెట్లను సోమవారం నిర్మల్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ సాయన్న ప్రయాణికులకు అందజేశారు. రూ.వంద చెల్లించి టికెట్ తీసుకుంటే ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 60 కిలోమీటర్ల వరకు పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ శేఖర్, నారాయణ, శ్యాంసుందర్ ఉన్నారు.

పాఠశాలల భూములు సర్వే చేయాలని వినతి

కుభీర్: మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఎంత స్థలం ఉందో సర్వే చేయాలని ఎంఈవో చంద్రకాంత్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వివరాలు అందిస్తే పాఠశాలల భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: మండలంలో ఇళ్లు లేని పేదల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. తర్లపాడ్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాల పంపిణీతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. బొమ్మెన సురేష్, నాగెల్లి నర్సయ్య, లక్ష్మి, శిరీష, లత, పద్మ, లింగవ్వ ఉన్నారు.

భగవద్గీత పఠనం చేయాలి

ఖానాపూర్: జీవకోటికి ఉన్న సమస్యలకు సమాధానాలు భగద్గీతలో ఉన్నాయని.. దానిని అందరూ పఠనం చేయాలని గీతా ప్రబోధకలు చిలమంతుల ఛత్రపతి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 74వ గీతా జ్ఞాన యజ్ఞ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వాసుదేవాచార్యులు, రామకృష్ణ, సందీప్‌శర్మ, అభిషేక్ శర్మ, జితేందర్, విశ్వనాథం, మాధవి ఉన్నారు.

పుడమి పులకించేలా హరితోత్సవం

- ఊరూరా మొక్కలు నాటిన అధికారులు, పాలకులు
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ఖానాపూర్ అర్బన్‌పార్కులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్



లక్ష్మణచాంద కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మ, అధికారులు, నాయకులు



ముధోల్: చించాలలో మొక్కలు నాటుతూ..



కుంటాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారం విజయవంతం కావడంతో పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించగా కుంటాల అటవీ శివారులో ఎమ్మెల్యే మొక్కలు నాటి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో తొమ్మిది శాతం అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సర్పంచ్‌లు సమత, హైమద్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, దత్తాద్రి, ఎఫ్ఆర్వో రాథోడ్ రమేశ్, డీఆర్‌ఓలు రేష్మ, ఇర్ఫానొద్దీన్, ఎఫ్ఎస్ఓ కోటేష్, ఎఫ్‌బీఓలు శంషొద్దీన్, హరిలత, స్రవంతి, లెనిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద పాల్గొన్నారు.

కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. సర్పంచులు కనీస్ ఫాతిమా, మల్లేశ్, లక్ష్మి, ఆనందరావు పటేల్, శృతి, ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, సవితారాణి, ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: హరిత తెలంగాణ సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పట్టణంలో సాయిబాబా ఆలయ సమీపంలోని అర్బన్‌పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితోత్సవం నిర్వహించారు. అటవీశాఖ సఫారీ వాహనంలో ఎమ్మెల్యే పార్కును సందర్శించి మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని రంగపేట, ఎర్రచింతల్ తండా, కొలాంగూడ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. రంగపేటలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అక్కడి నుంచి రాజూరాకు వెళ్లి అగ్నిప్రమాదంలో దగ్ధమైన పశువుల పాకను సందర్శించారు. మోహిద్, పుప్పాల శంకర్, కలీల్, వాల్‌సింగ్, వెంకాగౌడ్, గంగామణి, గోపాల్, లక్ష్మణ్‌రావు, చిన్నం రవి, చరణ్, ఎఫ్ఆర్వో వినాయక్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో హరితోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివకృష్ణ, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఎస్సై సాయికుమార్, ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, భోజన్న, కపిల్, ఈజీఎస్ టీఏలు మంజుల, హరిత, శారద ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంతోపాటు చించాల, తరోడా, రాటీ, మచ్కల్, ఎడ్‌బిడ్ తదితర గ్రామాల్లో హరితోత్సవం నిర్వహించారు. చించాలలో చెరువు కట్ట వద్ద ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఎస్సై సాయికిరణ్, ఎంపీడీవో సురేశ్ బాబు, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రామాలయంలో ఎంపీడీఓ అల్లాడి వనజ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ రాం రెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, కొండ్ర రమేష్, ఫసి, గంగారాం, కార్యదర్శి వీణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితోత్సవం నిర్వహించగా ఎంపీపీ అడ్వాల పద్మ పాల్గొని మొక్కలు నాటారు. కేజీబీవీ మైదానంలో ఎఫ్ఆర్వో పుండలిక్, జెడ్పీటీసీ రాజేశ్వర్, విద్యార్థినులతో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎఫ్ఆర్వో పుండలిక్, డిప్యూటి ఎఫ్ఆర్వో నజీర్ ఖాన్, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దిన్, ఏవో ప్రవీణ్ కుమార్, ఎస్‌వో నవిత, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మి, భూత్కూర్‌లో ఎంపీపీ సింగరి కిషన్ మొక్కలు నాటారు. ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో హరితహారం



నిర్మల్ ఆసుపత్రిలో నాటుతున్న దేవేందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. హరితోత్సవంలో భాగంగా జిల్లా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో వేణుగోపాల కృష్ణ, హెడ్‌నర్సులు భారతి, కృష్ణవేణి, శోభ, వైద్యులు అమీనా, ముఖేష్, వాసు, అమరేష్, రేడియోగ్రాఫర్ అబు అమీర్, స్టాఫ్‌నర్సు స్వరూప, మాణిక్య వీణ సిబ్బంది పాల్గొన్నారు.

పెంబి: హరితోత్సవంలో భాగంగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు.

సోన్: మండలంలోని మాదాపూర్ చెరువు వద్ద జెడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్ మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఏపీఎంలు ఖలీం, గంగామణి, ఏపీఓ మంజులారెడ్డి, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ రాజనర్సింహరెడ్డి పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజిగిలో నిర్మిస్తున్న పాఠశాల ఆవరణలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ 100 మొక్కలు నాటారు. సర్పంచ్ రాజమణి, మల్లేష్, హెచ్ఈఓ దాజిబా, ఎంపీటీసీ సంతోష్, కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఆలూరు ప్రకృతివనంలో మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ సరోజ, డీఆర్ఓ శ్రీదేవి, అధికారులు, తదితరులు ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనంలో ఎంపీడీవో శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, బాశెట్టి రాజన్న, సర్పంచ్ విఠల్ ఉన్నారు.



లోకేశ్వరం: పుస్పూర్‌లో సర్పంచ్ నర్సన్న,నేతలు



నిర్మల్‌రూరల్: ముజిగిలో నాటుతున్న పోలీసులు



సోన్: మాదాపూర్‌లో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్



తానూరులో..

నేడు మంత్రి పర్యటన

సారంగపూర్: మండలంలో మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం ప్రారంభించి చించోలి(బి) సమీపంలోని మైనారిటీ గురుకులం పరిశీలిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరవాలని కోరారు.

రేపు యోగా శిబిరం

భైంసాటౌన్: భైంసా డాక్టర్స్ అసోసియేషన్, శ్రీ నర్సింహా యోగాసమితి ఆధ్వర్యంలో మంగళవారం యోగా శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు డా దామోదర్‌రెడ్డి, శిక్షకులు మహిపాల్ తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక నర్సింహా కల్యాణ మండపంలో ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపు స్వర్ణబిందు ప్రాసన పంపిణీ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని శ్రీ చక్ర ఆయుర్వేద నాడీ వైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 21న బుధవారం ఉచిత స్వర్ణ బిందుప్రాసన పంపిణీ కార్యక్రమం ఉంటుందని డాక్టర్ అల్లాడి రవి ఓ ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్లలోపు వారందరికీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మందు ఉచితంగా పంపిణీ చేస్తామని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

'అవిశ్వాస తీర్మానం ఉపసంహరించుకోవాలి'

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ కలీల్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఉపసంహరించుకోవాలని పలువురు ముస్లిం, మైనార్టీ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని అర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీలు రాజకీయంగా ఎదగడం చూసి ఓర్వలేకే అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టారని ఆరోపించారు. ఎంఏ వకీల్, రహీం మజీద్ అధ్యక్షుడు జాఫర్ హుస్సేన్, అజీం, షేక్ రహీం, జీశాన్, జుబేర్, అఫ్సర్ ఉన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి అధ్యక్షుడు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర్చడం లేదన్నారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న కార్మికులను ఆదుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మున్నూరుకాపులకూ సాయం వర్తింపజేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మున్నూరుకాపులకూ వర్తింపజేయాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొట్టే హన్మాండ్లు అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాలను సారం మున్నూరు కాపులకు కులానికి జరుగుతున్న ప్రభుత్వ పథకాల అన్యాయాలపై సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జుట్టు అశోక్, కులపెద్దలు పురస్తు గోపాల్, సుదర్శన్ (ముధోల్), పేండేప్ కాశీనాథ్, తూము దత్తాత్రి, కిరడం రాజేందర్ (ముధోల్), గాలి రాజు, కార్గిరి గంగభూషణ్, సోనారి నాగభూషణం, ఆకుల సంజీవ్ (రాయపుర్‌కాండ్లీ), జుట్టు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: మున్నూరుకాపులకు ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం ముధోల్ తాలూకా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భైంసాలో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముధోల్ తాలూకా అధ్యక్షుడు రోల్ల రమేశ్, ఉపాధ్యక్షులు తోట రాజు, ప్రధాన కార్యదర్శి గాలి రవి, సహ కార్యదర్శి తోట రాము, గట్టన్న, అనిల్, భోజన్న, పోశెట్టి తదితరులున్నారు.

లోకేశ్వరం: లోకేశ్వరంలో తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందించిన వారిలో సంఘం అధ్యక్షుడు మంద లింగన్న, ఉపాధ్యక్షుడు భోజన్న, దేవన్న, సభ్యులు ఉన్నారు.

ముధోల్: ముధోల్‌లో డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్‌కు వినతి పత్రం అందించిన వారిలో దశరథ్, రమేష్, సుభాష్, లవన్, సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: తానూరులో తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందించిన వారిలో ఆ సంఘం మండలాధ్యక్షులు పోశెట్టి, సంతోష్, సభ్యులు ఉన్నారు.

కుంటాల: కుంటాలలో తహసీల్దార్ కలీంకు వినతిపత్రం అందించిన వారిలో ఆ సంఘం మండల కన్వీనర్ గోవింద్ రాజు, రాఘవేందర్, సభ్యులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో వినతిపత్రం అందించిన వారిలో సంఘం మండల అధ్యక్షులు వివేక్, విజయ్, అనిల్, నాగలింగం తదితరులు ఉన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నిర్మల్‌లో పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో పెద్ద ఎత్తున కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా ప్రసూతి ఆసుపత్రి లో బ్రేడ్స్ మరియు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, అర్జుమాండ్ అలీ, రాకేశ్, జునైద్, మతిన్, అల్తాఫ్, గాజుల రవికుమార్, పాడేల్లి గణేష్, ప్రతాప రెడ్డి, బూరాజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, షబ్బీర్ పాషా, తోట సత్యం, గంగనర్సయ్య, తదితరులు ఉన్నారు.

పండ్లు పంపిణీ

కడెం: మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సతీశ్‌రెడ్డి, మల్లేష్, రమేష్, వాజీద్, రఫీక్, బబ్లూ, భూమన్న, సలీం, రహీం ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. సోమవారం కుంటాలలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, జెడ్పీటీసీ గంగామణి బుచ్చన్న, సర్పంచులు సమత, ప్రవీణ్‌కుమార్, కిషన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, దత్తాద్రి, సీఈవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో నిర్వహించే విద్యా దినోత్సవానికి రావాలని కుంటాలలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి ఎంఈఓ ముత్యం ఆహ్వాన పత్రిక అందజేశారు. హెచ్ఎం నర్సయ్య, గంగాధర్, గంగన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ముధోల్: యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం ముధోల్‌లోని శివాలయంలో సన్‌సిల్క్, వైష్ణవి యువ భారత్ బిలాజిక్ సంస్థలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది నిరుద్యోగ యువతకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారికి కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రూజ్‌ఖాన్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి యం.హన్మండ్లు, సంజీవ్, శ్రీనివాస్‌గౌడ్, సూర్యంరెడ్డి, నారాయణ్, శిక్షణ సంస్థల డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

'గిరిజనులకు అన్యాయం చేస్తున్న కేసీఆర్'

ఖానాపూర్: గిరిజనులకు అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ అన్యాయం చేస్తున్నారని పెంబి జెడ్పీటీసీ జానుబాయి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఓయూ జేఏసీ నాయకులు బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ద కాలంగా పోడు భూములు ఇస్తామని మోసం చేసిందన్నారు. గిరిజనబంధు ఇస్తామని చెప్పిన సీఎం దాని ఊసెత్తడం లేదన్నారు. సమావేశంలో భూక్య గోవింద్ నాయక్, రాజేందర్, సిద్ధార్థనాయక్, రాజేందర్, సూర్య తదితరులు ఉన్నారు.

భూమిపూజ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.94 లక్షలతో నిర్మించే భవనానికి సోమవారం సర్పంచ్ రాంరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సూర్యతేజ, జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీ మల్లేష్, ఎంపీడీవో అల్లాడి వనజ, ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, ఎస్ఎంసీ ఛైర్మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొర్ల కొట్టం దగ్ధం.. పది జీవాలు సజీవ దహనం

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాపెల్లి భీమన్నకు చెందిన గొర్ల కొట్టం పూర్తిగా దగ్ధమైంది. 10 గొర్రెలు సజీవదహనం కాగా, ఒక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని స్థానికులతో కలిసి 60 గొర్రెలను ప్రాణాపాయం నుంచి తప్పించారు. ప్రమాదంలో రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని, తనకు పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

పేద కుటుంబానికి చేయూత

లోకేశ్వరం: మండలంలోని రాజూరలో నిరుపేద అయిన చిన్నయ్య కుటుంబానికి రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు, సరుకులను సోమవారం సర్పంచ్ ముత్తగౌడ్ అందజేశారు. సర్పచంతోపాటు ఉపసర్పంచ్ ప్రవీణ్, గంగాధర్, జావిద్, భోజన్న, వినీత్ సమకూర్చారు.

సర్టిఫికెట్లు సకాలంలో ఇవ్వాలి

లక్ష్మణచాంద: బీసీ కులవృత్తులకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం దరఖాస్తుకు కావాల్సిన సర్టిఫికెట్లను మండల ప్రజలకు సకాలంలో ఇవ్వాలని బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ కవితారెడ్డికి వినతిపత్రం అందించారు.15 రోజులుగా ఇబ్బంది పడుతున్నారని.. సమస్య పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మీసేవ సర్వర్ స్లో అయిందన్నారు. సమస్యల పరిష్కరిస్తామన్నా రు. బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, రంజిత్, ఆలూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

లక్ష్మణచాంద: విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్న ఫెర్టిలైజర్ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కనకాపూర్‌లో ఆయన మాట్లాడారు. పత్తివిత్తనాలు, యూరియా కొరత ఉందంటూ మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో అధిక ధరలకు ఆరోపించారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు 12రకాల సరుకులు ఇవ్వండి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పేద,మధ్యతరగతి కుటుంబాలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి మాట్లాడుతూ పాలకులు పక్షం రోజులకోసారి ఇంధన ధరలు పెంచడంతో రవాణా చార్జీలు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని వాపోయారు. మోదీ పాలనకు ముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200 చేరిందన్నారు. సబ్సిడీలు కార్పొరేట్లకు కాక పేదలకు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో దరఖాస్తు చేసుకున్నా.. రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సమత, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, గంగామణి, రేష్మ, దేవవ్వ, రాజన్న, బక్కన్న, ఎస్.గంగన్న, జమున, అరుణ, నర్సవ్వ, సుమలత పాల్గొన్నారు.

బీజేపీ నేతల సహపంక్తి భోజనం

నిర్మల్‌చైన్‌గేట్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో టిఫిన్ బైటాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు వారి ఇళ్ల నుంచి తీసుకొచ్చిన అల్పాహారం ఆరగించారు. అనంతరం మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి మాట్లాడుతూ ప్రధాని సూచన మేరకు కులమతాలకు అతీతంగా ఒకే చోట సహపంక్తి భోజనం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి రావుల రామనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, కమల్నయన్, జిల్లా కార్యదర్శి శ్రావణ్ రెడ్డి, రాచకొండ సాగర్, రజిని వైద్య, నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.